
# సింగిల్‌పేజి కథలు

## ప్రాప్తం



గ్యాస్‌పై కుక్కర్ పడేసి ఉస్సూరంటూ సోఫాలో కూలబడింది సుష్మ. ప్రొద్దుటి నుంచి జరిగిన సంఘటనలు తెరలు తెరలుగా జ్ఞాపకం రాసాగాయి.

తను ప్రొద్దున్నే ఎంతో సంతోషంగా మార్కెట్‌కు వెళ్ళి కావలసిన కూరగాయలు కొంటూంటే జరిగిందా సంఘటన. ఎవరో గట్టిగా తన ముంజేతిని తాకడంతో చేతిలో మామూలుగా పట్టుకున్న హ్యాండ్ పర్స్ గాల్లో ఎగరడం అది నేలనైనా తాకకుండానే మాయమైపోవడం క్షణాల్లో జరిగిపోయింది.

ఈ హఠాత్పరిణామంతో చిత్తరువులా నిలబడిపోయింది. మరుక్షణంలో మేల్కొని చుట్టూ కలయ జూసింది. ఏ చేతిలోనైనా తన పర్సు అగుపడ్తుందేమోనని మార్కెట్ కలియ తిరిగి అందరి వైపు చూసింది. లాభం లేకపోయింది. పర్సులో రెండొందలపైగా చిల్లరతో పాటు ఇంటి తాళం చెవులు కూడా పోయాయి. ఆ వెధవెవడో డబ్బులు తీస్కొని ఆ పర్సు పడేసినా బాగుండు. తాళం చెవులైనా దక్కేవి. దొంగపీనుగ పద్ధతిగా చేసాడీ దొంగతనం. రకరకాలుగా మనసులో తిట్టుకుంటూ ఆటోని కేకేసి ఆటో ఎక్కేసి కూర్చుంది. మనసంతా గజిబిజిగా తయారైంది. ఆటోలో కూర్చుందన్న మాటేకానీ మనస్సంతా ఆలోచనలే. ఇప్పుడేం చేయాలి? తన చేతిలో పైసా లేదు. పక్కింటి వారి నడిగితే డబ్బులిస్తారు గానీ ముందు సానుభూతి చూపించి వెనుక ఇంకొకరి ముందు ఎగతాళి చేస్తారని ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చింది. ఆటోని తన ఇంటి దగ్గరలో ఉన్న షాపు ముందాపించింది. షాపువానికి జరిగింది క్లుప్తంగా చెప్పి, తరువాతిస్తానని మూడొందలు తీస్కొని ఆటో అతనికిచ్చి పంపించేసి, ఆ పక్కనే ఉన్న తాళాలు తీసే అతన్ని పిలుచుకొని వచ్చింది. అసలే డోర్ లాక్ పైగా తాళం కప్ప వేసి మరీను. రెండూ తీసేసరికి రెండొందలొదిలాయి.

కుక్కర్ వేసిన విజిల్‌తో ఆలోచనల్లోంచి బయటకొచ్చి గ్యాస్ ఆర్పటానికి వంటింటి వైపు కదిలింది.

ఇంతలో కాలింగ్ బెల్ మోగటంతో వెళ్ళి తలుపుతీస్తే ఎదురుగా పిల్లలు. వారి మాటలు అల్లరితో కాస్త మనసు నెమ్మది పడినా దిగులు చికాకు పూర్తిగా పోలేదు. పిల్లలతోపాటు భోజనం ఇంటి పనులు ముగిసే సరికి సాయంత్రమయింది. పిల్లలు వాళ్ళలో వాళ్ళు చదువుకుంటూ మాట్లాడుకుంటున్నారు. పిల్లల అల్లరితో పాడయిన ఇంటిని శుభ్రం చేసి ముభావంగా తయారయి హాల్లోకి రావడంతోటే కాలింగ్ బెల్ మ్రోగింది. తలుపు తీస్తే ఎదురుగా శ్రీవారు. "అరే! ఈరోజు తొందరగా వచ్చేసారే!"

"ఈరోజు ఆఫీసు పని త్వరగా ముగిసిందిలే" అంటూ నా వైపు చూసి "నువ్వేంటలా ఉన్నావ్?"

"ఏం చెప్పనండీ?" అంటూ జరిగిందంతా దిగులుతో మెల్లిగా చెప్పింది తను.

"సరేలే! జరిగిందేదో జరిగింది దిగులు పడకు. ఊహించని రీతిలో దొంగతనాలు పెరుగుతున్న ఈరోజుల్లో చాలా జాగ్రత్తగా వుండాలి. ముందు జాగ్రత్తతో మనం తాళం కూడా మార్చటం మంచిదేమో! సరేలే తలుపేసుకో. నేనలా బజారుకెళ్ళి మరో తాళం కొని కొట్టువానికి డబ్బులిచ్చి వస్తా" అని రోడ్డున పడ్డాడు భాస్కరం.

ఓ రెండ్రోజుల తర్వాత పదిగంటల వేళ కాలింగ్ బెల్ మ్రోగితే వెళ్ళి తలుపుతీసింది. ఎదురుగా దోబి రాజమ్మను చూసి "నువ్వా రాజీ నిన్ననగా పిలిస్తే ఈ రోజొచ్చావా? బట్టలిక్కడే కవర్లో ఉంచా ఇంద తీస్కో"

"ఏం జెయ్యాలమ్మగోరూ! మా సంటోడికేమో బానే దాయె. డాటోరుబాబు దగ్గరెళ్ళి సూది మందులిప్పించినా నాయె" అంటూ అదేదో చెప్తోంది గాని అవి నా చెవిలో దూరటం లేదు. నా చూపులన్నీ దాని చేతిలోనున్న పర్సు మీదున్నాయి. అదా విషయం గమనించినట్లుంది. "ఈ పరుసామ్మగోరు! ఇది నాదేనండీ ఎలాగాంటారాండీ? ఇందాక గుడ్డలిద్దామని ఆ పోలీసమ్మగోరాండీ అదేనండీ ఆ కామాచ్చమ్మగారింటి కెళ్ళానాండి. అక్కడ బల్లమీనుండాండీ గీ పరుసు. మా బాగా నచ్చేసిందండీ. అప్పుడ్నేనన్నానమండీ కామాచ్చమ్మగోరూ మీరు నాకు నలభై రూపాయలియ్యాలా అదొగ్గేత్తానండీ నాకా పరుసియ్యమన్న అదట్టుకెళ్లమన్జెప్పి తరువాజెప్పిందండీ. మొన్నె సంతకాడంటండి దొంగనాయాలు ఈ పరుసు నొక్కేసి పారిపోవటం సూసి ఆ పోలీసాయన గోరు ఆల్లెనకాతలెల్లాడా ఆల్లు దొరక్కుండా పరుసు కిందపడేసి పారిపోయారంటండీ. ఈయన గోరు వంగి పరుసు తీసి సుట్టూ సూత్తె ఆల్లు కన్పన్నెదంటండి పరుసు సూత్తే కాలీ గుందంట. అదండి కథ. అమ్మో! సానసేపయిందమ్మ నేనింక మూడిల్ల కాడెల్లి 'గుడ్డల్దేవాలండీ సానా పనుంది. వత్తానమ్మాగోరం"టూ నేనిచ్చిన గుడ్డల్ని తీసుకుని వెళుతున్న దానివైపు కళ్ళప్పగించి అలా చూస్తుండిపోయాన్నేను. నిస్సత్తువగా అన్పించింది. పర్సునాదయివుండి కూడా నాదని చెప్పుకోలేని స్థితి నాది. ప్రాప్తమంటే ఇదే కాబోలనుకుంటూ తలుపేసుకున్నాను.

**-వరలక్ష్మి నాయక్** (గోవా)

★ ★ ★

ఉదయం ఇంటినుండి బయలుదేరేటప్పుడు ఆకాశం తేటగానే వుంది. మబ్బులు గట్రా ఏమీ లేవు. కాకినాడలో దిగగానే ఆకాశం మేఘావృత్తమైంది. అలాగే పి.ఎఫ్. ఆఫీసుకి వెళ్ళేను. పనికాలేదుగానీ, ఆఫీసులోనుండి ఇవతలకు రాగానే ముసురుపట్టి వాన మొదలైంది. చుట్టుపక్కల ఆటోలు కూడా ఏమీ లేవు.

వానకి తడవకుండా ఎదురుగా ఉన్న బస్సు స్టాపు వద్ద నిలబడ్డాను. ఒకవేళ ఆటో దొరికి బస్సుస్టాండుకి వెళ్ళినా తుని వెళ్ళే బస్సు ఎన్ని గంటలకు వస్తుందో తెలియదు. ఎవరైనా తెలిసినవాళ్ళు కన్పిస్తే బాగుండును. నా ఆలోచనలలో నేనుండగా, 'సుశీలగారూ' అన్న పిలుపు

విని ప్రక్కకు చూశాను. నా ప్రక్కన యశోదమ్మగారు నిలబడి ఉన్నారు. "అరె మీరిక్కడ?" కాస్త ఆశ్చర్యంగానే అడిగాను.

"నేను పెన్షన్ ఆఫీసుకి వచ్చాను. మరి మీరో!"

"నేనూ డిటో" అన్నాను.

"ఈరోజు క్లర్క్ శెలవులో ఉన్నాడట. రేపు ఉదయం రమ్మన్నారు. మిమ్మల్నీనా?"

"అవును" అన్నారావిడ. ఇంతలో వానలో రాత్రి తుని వెళ్ళి, మళ్ళీ పొద్దున్నే రావడం ఎలాగా అని ఆలోచిస్తున్నాను. వయసు మీద పడుతోంది కదా!

"నిజమే. మీరు చెప్పినట్లు ఇప్పుడు తుని వెళ్ళి, మళ్ళీ ఉదయం రావటం కష్టమే" అన్నారు యశోదమ్మగారు.

ఆవిడకు పాపం మోకాళ్ళ నెప్పులు కూడా. నేను డెబ్భై దగ్గరలో ఉన్నానేమో, చీకటిలో కళ్ళు సరిగా కనిపించవు. ఆడవాళ్లు కావడంతో రాత్రి హోటలులో ఉండటానికి భయం వేస్తుంది. నేను అదే మాట యశోదమ్మగారితో అన్నాను.

"సుశీలమ్మగారూ! మీరు కంగారుపడకండి. కామాక్షిగారని నాకు తెలిసిన ఒక రిటైర్డ్ టీచరు ఉన్నారు. వాళ్ళింటికి వెళ్ళి ఈ రాత్రి ఉందాము"

"ఫరవాలేదా? ఆవిడేమీ అనుకోరా? పోనీ ఫోను చేసి అడుగుదామా?"

"ఫర్లేదు. పదండి. వెడదాము" అంటూ ఖాళీగా పోతున్న ఆటోను ఆపి "రండి" అని ఎక్కి కూర్చున్నారు. చేసేది లేక నేనూ ఆటో ఎక్కేను. కానీ మనసులో నాకు చాలా సంకోచంగా వుంది. యశోదమ్మగారు చెప్పిన కామాక్షిగారు మమ్మల్ని ఎలా రిసీవ్ చేసుకుంటుందో, ఇంతకీ ఇంట్లో ఉందో లేదో? నా మనస్సులోని శంకలను ఆవిడముందుంచక మునుపే ఆటో ఓ ఇంటి ముందు ఆగింది. తలుపులు వేసి వున్నాయి. యశోదమ్మగారు ఆటోవాడిని పంపేసి, "ఫరవాలేదు, నాతో రండి" అంటూ కాలింగ్‌బెల్ వత్తింది. సుమారు ఓ యాభై సంవత్సరాల వయస్సు ఆవిడ తలుపు తీసి "అమ్మా! మీరా? రండి" అంటూ మమ్మల్ని లోనికి ఆహ్వానించింది. "వెంకటలక్ష్మి అమ్మగారు లేరా?" అని ప్రశ్నించారు యశోదగారు.

"అమ్మగారు పనుందని బయటకు వెళ్ళేరమ్మా! ఒక గంటలో వస్తానన్నారు. ముందు మీరలు తలలు తుడుచుకోండమ్మా" అంటూ మాకు టవల్సు తెచ్చి ఇచ్చింది. ఇంతలో మా మాటలు విని ఇంకో ఇద్దరు మహిళలు సుమారుగా మా వయస్సు వాళ్ళే ఇవతలకు వచ్చేరు.


"అరె యశోదమ్మగారూ మీరా! ఈ వానకి మీరు ఇక్కడ ఆగిపోయారా?" అంటూ యశోదగారు నన్ను వాళ్ళకు పరిచయం చేశారు. వాళ్ళలో ఒకావిడ పేరు జమునగారు, మరొకామె పేరు శ్యామలగారు.

"అమ్మా! మంచినీళ్ళు తీసుకోండి. టీ పెట్టమంటారా? కాఫీయా?" అడిగింది వెంకటలక్ష్మి. "టీ అయితే ఈ వానలో బాగుంటుంది కదండీ శ్యామలగారూ" అన్నారు యశోదమ్మ. "అమ్మా! వీళ్ళతోపాటు మీకు కూడా టీ తేనా అమ్మా! మళ్ళీ తాగుతారా?" అడిగింది వెంకటలక్ష్మి.

"ఏం! మేమేం పాపం చేసుకున్నాం? ఒకసారి త్రాగితే మళ్ళీ టీ తాగకూడదా? వంట అయ్యేటప్పటికి ఎలాగూ ఓ గంట పడుతుంది. వాన కూడా పడుతుంది. ఈ చలిలో టీ తాగితే భలే మజాగా వుంటుంది. అందరికీ తీసుకురా వేడి వేడి టీ" తలుపు తోసుకుని లోపలికి వచ్చి, చెప్పులు, గొడుగు పక్కన పెట్టి కుర్చీలో కూర్చుంటూ ఒకావిడ అంది.

"కామాక్షిగారూ! మేము పెన్షన్ ఆఫీసుకు వచ్చాము. పనికాలేదు. అందుకే ఈ రాత్రి ఇక్కడ ఉందామని" అని

# స్ఫూర్తి ప్రదాత



చెబుతూ ఆవిడకు నన్ను పరిచయం చేశారు యశోదగారు.

ఫరవాలేదు. ఒక్కరాత్రి కాకపోతే రెండు రోజులుండండి. మీ పని పూర్తి చేసుకొని మరీ వెళ్ళండి" అన్నారు కామాక్షిగారు మనస్ఫూర్తిగా.

నాకు అంతా అయోమయంగా అనిపించింది. "ఏమిటి? ఇదేమైనా హాస్టలా?" రకరకాల అనుమానాలు నా మనసును చుట్టుముడుతున్నా అడగడం సభ్యత కాదని ఊరుకున్నాను. వెంకటలక్ష్మి సర్వ్ చేసిన వేడి వేడి టీ తాగుతూ అందరం కబుర్లలో పడ్డాం. ఇంతలో యశోదమ్మగారు లోపలికి వెళ్ళి "వెంకటలక్ష్మీ! ఈ వేళ కూరేం వండుతావని" అడిగి చిక్కుడు కాయలు తెచ్చేరు. అందరం కలిసి చిక్కుళ్ళు బాగు చేసి ఇచ్చాము. వెంకటలక్ష్మి వంట పూర్తయ్యేలోగా రకరకాల విషయాల మీద మా మధ్య చర్చలు జరిగాయి. ఇంతలో జమునగారు అన్నారు. "ఏమైనా అనుకోండి కామాక్షిగారు! నా మనసులో మాట చెబుతున్నాను. మీ ఆలోచనలు, మీ పనులు చాలా ఉదాత్తంగా ఉంటాయి"

"అంతంత పెద్ద మాటలు వద్దండి. సమాజం పట్ల ప్రతీ ఒక్కరూ బాధ్యతతో ప్రవర్తించాలి. ఏదో నాకు చేతనైన సాయం చేస్తున్నాను" అన్నారావిడ. అప్పటివరకూ అర్థమయీ అవనట్లు ఉన్న పజిల్ విడిపోయింది.

"ఇలా ముఖ పరిచయం లేని వాళ్ళకు ఆశ్రయం ఇస్తే వాళ్ళు మోసం చెయ్యరా?"

"ఎందుకు చెయ్యరూ? రెండుసార్లు అలాగే జరిగింది కూడా. కట్టుకుందుకు ఇచ్చిన చీరతో సహా. అందిన వస్తువులు తీసుకొని అర్ధరాత్రి అందరూ నిద్రపోతున్నప్పుడు ఒకామె ఉడాయించింది. నవ్వుతూ అన్నారు కామాక్షిగారు. అప్పటినుండి నేనూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నాను కదా? మీకూ తెలుసును. అయినా ఎవరో ఏదో చేశారని మనకు చేతనైన సహాయం ఇతరులకు చెయ్యకపోతే ఎలా? వంట చేస్తూంటే చెయ్యికాలిందని నిప్పు వెలిగించడం మానెయ్యలేము కదా? చెయ్యి కాలడానికి మన అజాగ్రత్తే కారణమని అనుకొని ఇంకొంచెం జాగ్రత్తగా ఉంటాం కదా? దేవుని దయవల్ల నాకు తిండికి లోపం లేదు. నా కొడుకులు బాగానే సంపాదించుకొంటున్నారు. వాళ్ళకి నేను కూడబెట్టి ఇవ్వాల్సిన అవసరం లేదు. అయినా మీలాంటి వాళ్ళతో కలిసి ఇంత ఆనందంగా గడిపిన ఈరోజు ఎంత డబ్బు పెడితే దొరుకుతుంది"

ఇంతలో వెంకటలక్ష్మి వచ్చి వంట అయిందని, అందరినీ భోజనాలకు లేవమని చెప్పింది. "అన్నట్టు నాకు తగ్గట్టే ఈ వెంకటలక్ష్మి కూడా. ఇంటికి వచ్చిన అతిథులకు అన్నీ ఆదరంగా చేస్తుంది" నవ్వుతూ ఆమె వైపు చూశారు కామాక్షిగారు.

"ఊరుకోండమ్మా. నాలాంటి ఒంటరి దానికి ఆశ్రయమిచ్చారు. మీ ముందు నేనెంత?"

"ఒకళ్ళనొకళ్ళు పొడుగుకుంటూ రాత్రి తెల్లవార్లూ ఇలాగే కూర్చుందామా? పద పద" డైనింగ్ హాలు వైపున డిచారామె. మేమందరం ఆ రాత్రి నాకు చెప్పలేని ఒక అనుభూతిని మిగిల్చింది. రిటైరయిన నాటి నుండి నేను ఏవైనా సేవాకార్యక్రమాలలో పాల్గొని సమాజ సేవ చెయ్యాలని అనుకునేదాన్ని. కానీ ఏదీ చెయ్యలేకపోయాను. ఏదైనా చేద్దామంటే ఎన్నో అనుమానాలు మరెన్నో సందేహాలు. ఇప్పుడు కామాక్షిగారు నాకు స్ఫూర్తి ప్రదాతగా నిలిచారు. 'స్వంతలాభం కొంతమానుకు పొరుగువాడికి తోడు పడవోయ్' అన్న గురజాడ వారి సూక్తి నాకు గుర్తుకొచ్చింది.

**-మద్దాల శకుంతలాదేవి**

(హైదరాబాద్)